# దేవర పెట్టి

"దేవరపెట్టి" వారలు అనగా కాళికాదేవి భక్తులు - ఉపాసకులు. వీరిని దేవరులు అంటారు. దేవరకులస్థులు అమ్మవారిని స్తుతిస్తూ చేతిలో కొరడాలు పట్టుకొని వంటినిండా పసుపు కుంకుంలతో బొట్లుపెట్టుకుని జుట్టు విరబోసుకొని, చేతులకు భూంభేతాళ తీగలతో తయారుచేసిన కడియాలు ధరించి కాళ్లకు గజ్జెలు కట్టుకొని దేవర పెట్టి (అమ్మవారిగుడి)ని తలపై పెట్టుకొని "శరణే శరణే భ్రమరాంబా - నీకే శరణే భ్రమరాంబా - గజ్జెకట్టవే మారెమ్మా - గాజులు వేయవే మా తల్లీ" అనే పాట పాడుతూ, డప్పు వాద్యాలు వాయిస్తూండగా - అమ్మవారి గుడిని వీధి మధ్యలో పెట్టి జనం గుమిగూడిన తరువాత పట్టపగలు కొరడాలతో వీపుపై కొట్టుకుంటూ, కొన్ని కనికట్టు




విద్యలు ప్రదర్శిస్తూంటారు. అవి తాడుని రెండుముక్కలుగా చేసి మరలా అతికించడం, గుడ్డపరచి అందులో పేలాలు వేయించడం, నీళ్లలో పసుపు కుంకుమ కలిపి మళ్లీ ఆ పసుపుకుంకుమను పొడిగాపైకి తీయడం, బొమ్మని త్రాడుపై నడిపించడం - మూడు చెక్క గుళ్లను త్రాడుతో కట్టి ముడివిడిపోకుండగా ఆ మూడు గుళ్లనూ క్రింద పడవేయుటం - వేపాకుతో, జర్రెలు, తేళ్లు చేయడం - అగ్ని స్థంభన వగైరా కనికట్టు విద్యలను ప్రజలకు చూపిస్తూ బహుమతులు తీసుకుని పొట్టపోసుకొనేవారే "దేవర పెట్టి' ' వారు.

వీరు ఎక్కువగా శ్రీశైలం ప్రాంతంలో ఉన్నారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో కూడా ఉంటున్నారు. ఆ జిల్లాలలో ఈ కళకు ఆదరణ లభించుచున్నది.
శ్రీ సున్నవరపు వీరయ్య శ్రీ విభూతి భవానీ లింగం, శ్రీ యడవల్లిరమణ దేవర పెట్టె కళారూపా ప్రదర్శనలలో ప్రసిద్ధులు. వీరికి పూర్వము శ్రీ అయ్యపు వెంకట కృష్ణ గారు తమ రచనలు ద్వారా ఈ వేషానికి విస్తృత ప్రచారం చేశారు.